క్లుప్తంగా

నియామకం



కాటారం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా మండల కేంద్రానికి చెందిన గంటా కిరణ్మయి నియమితులయ్యారు. సిద్దిపేటలో నిర్వహించిన 43వ రాష్ట్ర మహాసభల్లో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని శనివారం ప్రకటించారు. శాతావాహన యూనివర్సిటీ నుంచి గంటా కిరణ్మయికి రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర బాధ్యులకు కిరణ్మయి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె నియామకంపై మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

పూజారులకు దుస్తుల పంపిణీ



కాశేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని లక్ష్మీదేవర గుడి పూజారులకు అదే గ్రామానికి చెందిన ఎర్రోళ్ల స్వప్న-రమేశ్ దంపతులు దుస్తులను పంపిణీ చేశారు. శనివారం ఆలయంలో మొక్కులు చెల్లించి 30మంది గుడి సభ్యులకు దుస్తులను పంపిణీ చేశారు. వారి వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు.

పరామర్శ



రేగొండ: మండలంలోని గూడెపల్లి గ్రామానికి చెందిన సిద్దూరి రాదమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిథర్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన వెంట కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోలుసాని తిరుపతిరావు, మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి, నాయకులు లింగంపల్లి రాజేశ్వర్ రావు, తిరుపతి రావు ఉన్నారు.

కేసు నమోదు

టేకుమట్ల: మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన అరుణ్ అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించగా శుక్రవారం బాధిత మహిళ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

రేగొండ: మండలంలోని రేపాక, పొనగండ్ల గ్రామంలోని గుడుంబా స్థావరాలపై దాడి చేసి 13 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ శనివారం తెలిపారు. ఈ మేరకు గుడుంబా అమ్ముతున్న పొనగండ్ల గ్రామానికి చెందిన ఉల్లి రమ, రేపాకకు చెందిన శివరాత్రి ఓదెలుపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. మండలంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెపా జిల్లా ఉపాధ్యక్షుడిగా నరేశ్



ములుగు రూరల్: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా భూమ నరేశ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నరేశ్‌కు నియమకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్, రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవిందర్, రామక్రిష్ణ, చిరంజీవిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



వాజేడు: మండల పరిధిలోని అమడపాక గ్రామంలో భగవాన్ బుద్ధ అవార్డు గ్రహీత దుర్గం నగేశ్‌ను మండల నేతకాని సామాజిక వర్గం ప్రజలు శనివారం శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, కొండా చరణ్, కుమ్మరి రాంబాబు, వెంకటేష్, శేఖర్, సాంబశివరావు, కేశవరావు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

భవనం ఒక్కటే.. శాఖలు మూడు

- ప్రాథమిక పాఠశాలలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, జీపీ కార్యాలయం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, గ్రామస్తులు



గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం



గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల భవనం



పాఠశాలలో తరగతులు నిర్వహించే గది



అంగన్‌వాడీ, జీపీ కార్యకలాపాలు నిర్వహించే గది

రేగొండ: ఎంత చిన్న గ్రామమైనా ఒక్కో శాఖకు ఒక్కో భవనం లేదా ఒక్కో గది ఉండటం సర్వ సాధారణం. కానీ కొత్తపల్లిగోరి మండలంలోని గాంధీనగర్‌లో ఒక్క పాఠశాల భవనంలోనే మూడు శాఖలకు సంబంధించిన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. రెండు గదులు, వరండాతో పాఠశాల భవనం ఉంది. ఈ భవనంలో ఉన్న ఒక గదిలో ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాల నిర్వహిస్తుండగా, మరో గదిలో అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. మూడు శాఖలకు సంబంధించిన కార్యకలాపాలు ఒకే భవనంలో సాగుతుండటంతో చాలా ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యార్థులకు తరగతులు జరుగుతున్నప్పుడు అంగన్‌వాడీ పిల్లలు చేసే అల్లరితో చాలా ఇబ్బందిగా ఉందని విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామపంచాయతీకి పనుల కోసం గ్రామస్తులు, అధికారులు రాకపోకలు సాగిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా పాఠశాల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి, గేటు ఏర్పరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శిలాఫలకం సరే.. పనులేవి

గత ప్రభుత్వ హయంలో గాంధీనగర్‌ను నిజాంపల్లి నుంచి విభజించి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఎటువంటి కార్యాలయాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రూ.20 లక్షల అంచనా విలువతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. కానీ శిలాఫలకం వేసి తొమ్మిది నెలలు గడుస్తున్న ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వేర్వేరుగా కార్యాలయాలకు భవనాలను నిర్మించాలని, లేకుంటే ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భవనాలు నిర్మించాలి



ఒకే భవనంలో మూడు శాఖలు నిర్వహించడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలి. అలాగే అంగన్‌వాడీ కేంద్రం కోసం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. పాఠశాలకు ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేయాలి.

-సంతోష్, మాజీ సర్పంచ్, గాంధీనగర్

పెద్దమ్మతల్లి దీవెనలు అందరిపై ఉండాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: పెద్దమ్మతల్లి దీవెనలు అందరిపై ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండలంలోని పంగిడిపల్లిలో ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు ముదిరాజ్ నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, నాంపెల్లి వీరేశం, శాస్త్రాల కిరణ్, అడగాని రామారావు, కత్తి సంపత్, మాదాసి మహేందర్, మహేష్, ముదిరాజ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గండ్ర ప్రత్యేక పూజలు

పంగిడిపల్లిలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై ప్రత్యేక మొక్కులు చెల్లించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి, రెడ్డి మల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

పేదలకు అండగా సీపీఐ



నినాదాలు చేస్తున్న నాయకులు

- పార్టీ జిల్లా నాయకుడు చంద్రమౌళి

రేగొండ: పేద ప్రజలకు అండగా కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని సీపీఐ జిల్లా సీనియర్ నాయకుడు చంద్రమౌళి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాలను శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. రైతులు, కూలీలు, కార్మికుల కోసం ఉద్యమించిన ఘనత సీపీఐదని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం అనేక పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పెంట రవి, నాయకులు అన్నారపు రాజేందర్, చిగురుమామిడి మోహన్, కుదారి భవాని, కురాకుల లలిత, ఎడ్ల రాజయ్య, సాదు సారంగపాణి, రాజమ్మ, రఘుపతి పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదికలో మాట్లాడుతున్న అధికారులు

కాళేశ్వరం: మండలంలో ఉపాధి హామీ పథకం కింద గత ఆర్థిక సంవత్సరం మండలంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను శనివారం మహదేవపూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలలో చేసిన పనలపై ఆడిట్ బృందం వారం పాటు ప్రత్యక్షంగా తనిఖీ చేసి రికార్డులను చూడడం, అవకతవకలను గుర్తించారు. ఆ అవకతవకలను ప్రజావేదికలో చదివి వినిపించగా బాధ్యులపై క్రమశిక్షణలలో బాగంగా సిబ్బందికి పెనాల్టీ, రికవరీ రూపేనా రూ.1,14,071 లక్షలను జరిమానాను ప్రజావేదిక ప్రొసీడింగ్ అధికారి నరేశ్ విధించారు. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ గ్ అధికారి మాట్లాడుతూ.. సామాజిక తనిఖీలో వచ్చిన అభియోగాలపై సిబ్బందికి త్వరలో జిల్లా కార్యాలయం నుంచి షోకాజు నోటీసులు జారీ చేసి అనంతరం శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా విజిలెన్స్ అధికారి రూబీన , క్వాలిటీ కంట్రోల్ అధికారి కెధరమ్ సింగ్, అంబడ్స్ మెన్ ఆర్. శ్రీనివాస్, ఏ .రవీంద్రనాథ్, ఎంపీడీఓ కే. వెంకటేశ్వర్లు ఉపాధి హామీ ఎపిఓ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తేమ శాతం వచ్చినా తూకం వేస్తలేరు..

- ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

మల్హర్: ధాన్యం తేమ శాతం వచ్చిన కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తూకం వేస్తలేరని రైతులు వాపోతున్నారు. మండలంలో ఇప్పలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల 35 రోజుల కిందట ప్రారంభమైందని ఇప్పటి వరకు సెంటర్ పరిధిలో 25 శాతం కూడా కొనుగోళ్లు చేయలేదని తెలిపారు. కేంద్రంలో అధికారుల పర్యవేక్షణ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. నిబంధనల ప్రకారం ప్యాడి క్లీనర్‌తో తాలు పట్టి తేమ శాతం 17 వచ్చినప్పటికి సెంటర్ ఇన్‌చార్జ్ కాంటాలు పెట్టడం లేదన్నారు. ఈ నెల20న ఏఈఓ ధాన్యం చూసి కొనుగోలు కోసం టోకెన్ ఇచ్చినప్పటికీ కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. రైతులు చల్ల లచ్చయ్య, కొండపర్తి రమేశ్, కొండపర్తి సురేందర్, బొమ్మని సూర్యనారయణ ఉన్నారు.

కాస్తులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

- రైతు సంఘం నాయకులు

గోవిందరావుపేట: కాస్తులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. మండలంలో వందలాది మంది రైతులకు పట్ట లేక ప్రభుత్వ పథకాలు వర్తించక బ్యాంక్ రుణాలు రాక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కాస్తు కాలంలో ఉన్న ప్రతి రైతుకు పట్టా ఇవ్వాలని వారికి రైతు భరోసా వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులందరు కలిసి తహసీల్దార్ సృజన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు గుండు రామస్వామి, కార్యదర్శి రామ చంద్రరెడ్డి, సోమా మల్లారెడ్డి, చిట్టిబాబు, సదానందం, మహేందర్, సారయ్య, నాగరాజు, లెనిన్, రాజు, ఉపేంద్ర చారి, శ్రీను, రాజయ్య, కృష్ణ, నగేష్, కృష్ణారావు, సాంబయ్య, యాదిరెడ్డి, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితర రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వాజేడు: ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీల హక్కులను కాపాడుతూనే బహుజన నిరుపేద వర్గాల ప్రజల సమస్యలను ప్రభుత్వాలు మానవతా దృక్పదంతో పరిష్కరించాలని బీఎస్పీ కొత్తగూడెం భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్ తడికెల శివకుమార్ అన్నారు. మండల పరిధిలోని మండపాక గ్రామంలో శనివారం బీఎస్పీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా శివ కుమార్ హాజరై మాట్లాడారు. భూమి హక్కు రాజ్యాంగ బద్ధమని అన్నారు. మండల పరిధిలోని మండపాకలో తాము నివసిస్తున్న, సాగు చేసుకుంటున్న భూములపై అనేక ఇబ్బంది ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఐదవ షెడ్యూల్ ఏర్పాటు చేసే నాటికి అక్కడే జీవిస్తున్న వారందరిని కొండ గిరిజనులుగా వృత్తి జాబితాలో చేర్చాలని అంబేడ్కర్ సూచించినప్పటికి అది అమలు కాక పోవడం వలన ఈ ఇబ్బందులు ఎదురవుతున్నట్లు వెల్లడించారు. భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్, ఉపాధ్యక్షుడు కుమ్మరి రాంబాబు, తదితరులు ఉన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

- ఎస్సై తాజుద్దీన్



వెంకటాపురం(కె): తనిఖీ చేస్తున్న పోలీసులు



ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: యువత మత్తుకు బానిస కావొద్దని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, ఆర్టీసీ బస్సులు, ప్రధాన షాపులు, కూడళ్లలో పోలీసు స్నిఫర్‌డాగ్‌తో ముమ్మరంగా తనిఖీలను చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రత్యేక శిక్షణ పొందిన స్నిఫర్‌తో డాగ్‌తో ముందస్తు చర్యల్లో భాగంగా గంజాయి, డ్రగ్స్, పేలుడు పదార్థాల కోసం తనిఖీలు చేపట్టామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని కిరాణాషాపులు, దుఖాణాలలో శనివారం వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతి రావుల ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి ముమ్మరంగా తనిఖీలు చేశారు. షాపులను తనికీలు చేయటంతో పాటు మండల కేంద్రానికి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



ప్లేట్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ మేనక

మంగపేట: మండలంలోని రేగులగూడెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జ్వాలా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ కోడెల నరేశ్ సమక్షంలో ఎంఈఓ పాదెం మేనక శనివారం ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనక మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. హెచ్ఎం మాలోత్ రాజు, కమలాపురం కాంప్లెక్ హెచ్ఎం శ్రీనివాస్, ట్రస్టు ప్రధాన కార్యదర్శి రాకేశ్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలోని ఆర్‌టీఏ కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గంగిరేనిగూడెం గ్రామానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ములుగు మండలం సర్వాపురం గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ములుగు మీదుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆర్టీఏ కార్యాలయం వద్దకు రాగానే రాంగ్ రూట్‌లో ఎదురుగా మరో బైక్‌పై వస్తున్న వ్యక్తి సుధాకర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సుధాకర్‌కు గాయాలు కాగా స్థానికులు 108 వాహనంలో ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వర్గీకరణతోనే అన్ని వర్గాలకు న్యాయం

- ఎమ్మెస్పీ నాయకుడు ఇరుగు పైడి



మాట్లాడుతున్న ఇరుగు పైడి

ములుగు రూరల్: ఎస్సీ వర్గీకరణతోనే అన్ని వర్గాలకు రిజర్వేషన్లు లభించి న్యాయం జరుగుతుందని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు ఇరుగు పైడి మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ పోరాటం చేస్తున్నామని అన్నారు. మాలలు తమ రాజకీయ పలుకుబడి ఉపయోగించి వర్గీకరణ అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కుట్రలను తిప్పి కొట్టేందుకే వెయ్యి గొంతులు-లక్ష డప్పులతో మండే మాదిగల గుండె చప్పుళ్ల వినిపించడానికి శ్రీకారం చుట్టామని అన్నారు. అన్ని సామాజిక వర్గాలలో ఉన్న కళాకారులు ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా నిలవాలని అన్నారు. అనంతరం జిల్లా కళాకారుల నిర్మాణ కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రొంటాల కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇనుముల రమేశ్, ఉపాధ్యక్షుడిగా మందపల్లి నవీన్, కార్యదర్శిగా అమ్మపాట తిరుపతి, గౌరవ అధ్యక్షుడిగా గుగ్గిళ్ల సాగర్ నియమించారు. కార్యక్రమంలో మడిపెల్లి శ్యాంబాబు, ప్రసాద్, శంకర్, రాజేందర్, మల్లయ్య, నెమలి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని జంపన్న వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. రెడ్డిగూడెం లోలెవల్ కాజ్‌వే సమీపంలో వాగులో నుంచి జేసీబీ ద్వారా ట్రాక్టర్‌లో ఇసుకను లోడింగ్ చేసి స్నానఘాట్టాల ఒడ్డున ఇసుక దంపు చేశారు. ఈ విషయం తహసీల్దార్ గిరిబాబుకు సమాచారం తెలియడంతో శనివారం జంపన్నవాగును సందర్శించి వాగులో ఇసుక తవ్విన ప్రదేశాన్ని పరిశీలించారు. ఇసుక తవ్వకానికి వినియోగించిన జేసీబీని పట్టుకున్నారు. అనుతులు లేకుండా ఇసుక త్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని యజమానిని హెచ్చరించినట్లు సమాచారం. జేసీబీ స్వాధీనం చేసుకున్నారా? లేదా అనే విషయంపై తహసీల్దార్ గిరిబాబుకు ఫోన్ చేయగా స్పందించలేదు.

లారీల్లో తరలింపు

వాగులో నుంచి దంపు చేసిన ఇసుక రాత్రి సమయంలో లారీల్లో అక్రమంగా పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది. అధికారుల నుంచి అనుమతులు లేకుండా దళారులు అక్రమ ఇసుక దందాకు పాల్పడుతున్నట్లు వేలాది రూపాయాలు సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పవిత్రమైన జంపన్నవాగులో అక్రమంగా ఇసుక తోడడంతో భుగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉంది. ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో ఇసుక దళాలు పెట్రెగిపోతున్నారని ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముత్తినేని సదానందం అన్నారు. శనివారం మండలంలోని జగ్గన్నపేటలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ వైద్యం పొందిన నిరుపేదలకు వైద్యం ఖర్చులు భారం కాకుండా సహాయ నిధి ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సంగని శ్రీనివాస్, శ్రీహరి, కిట్టయ్య, విష్ణు, నరేష్, రాజు, అశోక్, వేణు, తదితరులు పాల్గొన్నారు.